



రామారావు మనసు మరుగుతున్న నీటిలా ఉంది.

అతను తేలు కుట్టిన దొంగలా తెగ బాధపడిపోతున్నాడు.

యిప్పుడు తనేం జేయాలి ... ఏం జేయాలి...ఎలా ... ఎలా — అసలు నిజంగానే యిలా జరిగి ఉంటుందా? స్వర్ణ యిలా చేయగలుగుతుందా? చేస్తే తనేం చేయగలడు...స్వర్ణను ఉద్యోగం చెయ్యా, ఉద్యోగం చెయ్యా అని బలవంతంచేసి చేసి తీరా తను తప్పే చేశాడా?

స్వర్ణ నిజంగానే యిలా చేస్తే తను ఆ నిజాన్ని భరించగలడా? ఆమె నీడ

నైనా తనమీద పారనివ్వగలడా. ఆమెతో యింకా యీ కాపురాన్ని కొనసాగించగలడా.

నో. నో—

ఆ ఊహనే భరించలేడు తను. స్వర్ణే గనుక అలా చేసినట్టు-చేస్తున్నట్టు తను స్వయంగా చూచి తెలుసుకోగలి గితే-ఆమెను ముక్కలు ముక్కలుగా నరికి, చిత్రవధ చేసి, కసి తీర్చుకుని-

మంచు ముక్కలున్న గాజుగ్లాసుపైన ఆవిరి క్రమ్ముకొచ్చినట్టు రామారావు ముఖమంతా చెమటలు పొంగుకొచ్చాయి.

లేచి కిటికీనుండి ఎటో చూస్తూ నిలబడ్డాడు కాస్సేపు మళ్ళీ అసహనంగా వెనక్కి గిరుక్కున తిరిగి గదిలో అటూ యిటూ పచార్లు చేశాడు. చటుక్కున ఆగి సర్రున అగ్గిపుల్ల గీసి సిగరెట్టు వెలిగించుకున్నాడు. మళ్ళీ చటుక్కున సిగరెట్టును నేలకేసి విసిరికొట్టాడు బలంగా—

ప్చ్-ఏమీ తోచడంలేదతనికి. మెద డంతా చీమలు కొరుకుతున్న బెల్లంలా ఉంది.

విసుగ్గా వాలుకుర్చీలో కూలబడి నిన్న సాయంకాలం తన ఆఫీసు అడ్రస్‌కు పోస్ట్‌లో వచ్చిన కవరును జాగ్రత్తగా జేబులోనుండి బయటికి తీశాడు. కొద్దిగా ముందుకు వంగి చూచి యింట్లో స్వర్ణ లేదనీ, ఆమె బాత్‌రూంలో స్నానంచేస్తున్నదనీ నిర్ధారించుకుని కవరులోనుండి కాగితాన్ని తీసి—

మళ్ళీ అతని గుండెలు ఉదకడం ప్రారంభించి—

చూపులు అక్షరాల వెంట రేసు గుర్రాల్లా పరుగెత్తుతున్నాయి.

"శ్రీ రామారావుగారికి,

నమస్తే.

నేనెవరినో మీకు తెలియదు. తెలి యాల్సిన అవసరం కూడా లేదనుకుం టున్నాను. కాని మీ శ్రేయస్సును కోరి యీ ఉత్తరం రాస్తున్నాను. ఎందుకంటే కొన్ని జీవితాలు నా కళ్లెదుటే నాశనమై పోతూంటే నేను చూస్తూ ఊరుకోలేను. నా మనసు మంచుగడ్డలాంటిది. ఊరికే ఏ చిన్న స్పందనకైనా కరిగి తల్లడిల్లు తుంది. సరే - అసలు విషయాని కొద్దాం.

స్వర్ణ మీ భార్య ఆ విషయం నాకు తెలుసు. ఆమె మొన్న మొన్ననే కొత్తగా డి.పి.ఐ.లో యల్డీసీగా అపాయింటయింది. అది కూడా నాకు తెలుసు. ఆమె ఉద్యోగం చేస్తూండడం వల్ల మీరూ సంతోషంగా ఉండి ఉంటారు. ఆ సంగతి కూడా నేను ఊహించగలను అయితే స్వర్ణ యీ పదిరోజుల్లో ఓ చేయకూడని పనిని చేయడానికి సిద్ధమై మెల్లమెల్లగా ఆ సముద్రంలోకి దిగబోతోంది. ఆమెలో

మీరు ఊహించని మార్పు వచ్చి మీ సంసార నౌకనే ఛిన్నాభిన్నం చేయ బోతోంది

అసలు సంగతేమిటంటే ... ఆమె ఎదురుగా రాజేష్ అనే కొత్తగా వచ్చిన ఓ యువగుమాస్తా ఉంటాడు. అతనూ, ఈమే ప్రొద్దస్తమానమూ చూపులతో పరస్పరం కొరుక్కుతింటూ, యికిలించుకుంటూ, సకిలించుకుంటూ, అక్కర ఉన్నా లేకున్నా ఒకరిదగ్గరికి ఒకరు ఏదో ఫైలు పట్టుకుని వస్తూ పోతూ మాట్లాడుకుంటూ ప్రేమాయణం సాగిస్తు న్నారు. యీ కథ యిలాగే సాగీ సాగీ పక్షులు కంచికి ఎగిరిపోయేలా ఉన్నాయి. యీ సంక్లిష్ట స్థితిలో మీకు అసలు సంగతిని తెలియజేస్తే వీలుంటే మీ తంటా లేవో మీరు పడతారని ఓ పావలా ఖర్చుపెట్టుకుని యీ ఉత్తరం రాస్తున్నాను. యిక మీ యిష్టం. సెలవు.

—మీ శ్రేయోభిలాషి."

క్రింద పేరు లేదు. శ్రేయోభిలాషి అన్న పదం ప్రక్కన ఓ పూవు గుర్తుంది.

బాత్‌రూంనుండి స్వర్ణ వస్తున్నట్టుగా చప్పుడైంది. చకచకా కాగితాన్ని మడచి జేబులో కుక్కుకున్నాడు.

మళ్ళీ ఆలోచనలు గుండుసూదుల్లా కురుస్తున్నాయి మెదడులో.

ఓ పదినిముషాల్లో స్వర్ణ బట్టల దుకాణాలలో ఉండే షోకేసులలోని బొమ్మలా అందంగా ముస్తాబై వచ్చింది. వచ్చి ఫ్లాస్కులోని కాఫీని చెరో కప్పులోకి వంచి ఒకటి రామారావుకు అందిస్తూ "అలా ఉన్నా రేమిటి" అంది అతనితో.

"ఎలా ఉన్నాను."

"ఏదో పోగొట్టుకున్నట్టు–"మామూలు గానే అంది.

నిన్నే పోగొట్టుకుంటున్నాను – అని అనుకుని "తల నొప్పిగా ఉంది" అన్నాడు అప్రయత్నంగా.

"అమృతాంజనం తేనా?"

"అవసరంలేదు. కాఫీ తాగుతున్నాం గదా తగ్గుతుందేమో–"


ఆమె ఓ లిప్తపాటు అతని ముఖం లోకి సూటిగా చూసి "అసలు మీరు నిన్న సాయంకాలంనుండే అదోలా ఉంటున్నారు" అంది బాధగా.

"నా మనసేమీ బాగుండలేదు స్వర్ణా...యివ్వాళ లీవ్ పెడదామను కుంటున్నాను. నువ్వు నీ ఆఫీసు కెళ్ళిపో – యిప్పటికే ఆలస్యమైపోతోంది నీకు."

"అయితే నేను కూడా లీవ్ పెట్టి యింటిదగ్గరుండి మిమ్మల్ని చూసు కుంటాను."

"అలా బాగుండదు. నువ్వు కొత్తగా ఉద్యోగంలో చేరావు. లీవ్ పెట్టడం బాగుండదు. నువ్వెళ్ళు."

"నా మనసంతా మీ దగ్గరే ఉంటుంది ప్రొద్దంతా."




నా దగ్గరెందు కుంటుంది. ఎదుటి సీట్లో చిక్కుపడిపోతుంది, నీ మనసు ఆఫీస్ కెళ్ళగానే అనుకుని "తప్పదు మరి ... కమాన్ నువ్వు బయలుదేరు మరి. నేనూ మా ఆఫీస్ కెళ్ళి లీవ్‌లెటర్ పారేసొస్తాను."

యిద్దరూ లేచి బయటికొచ్చి యింటికి తాళం వేసి నడిచారు నిశ్శబ్దంగా బస్‌స్టాండ్ వైపు.

"మీరు ఎందుకో అదోలా ఉంటున్నారు. చెప్పరా నాతో. వెధవ ఉద్యోగమని నా కొకటి అంటగట్టారు. లేకుంటే ఇంట్లో ఉండి మిమ్మల్ని కంటికిరెప్పలా చూసుకుందును—యింకా ఏదో అంటోందామె. యింతలోకి బస్ వచ్చేయడం... ఆమె యాంత్రికంగా ఎక్కేయడం—అది కదిలి తుఫానులా వెళ్ళిపోవడం ఓ క్షణంలో జరిగిపోయాయి.

"నం ...గ ... నా... చి" అనుకున్నాడు కసిగా రామారావు.

యివ్వాళ లీవ్ పెట్టిందెందుకు – నీ సంగతి స్టడీ చేయడానికేనాయె ... సర్రున సిగరెట్టు వెలిగించుకున్నాడు.

యింకో అయిదు నిముషాల తర్వాత మరో బస్ వచ్చింది స్వర్ణ ఆఫీస్ రూట్‌లోదే. గబగబా ఎక్కేసాడు. డిటెక్టివ్ నవలల్లో దొంగలను ఫాలో చేసి కూపీని బయటికి లాగబోయే హీరోలా ఫీలయ్యాడు తనకు తాను.

స్వర్ణ ఆఫీస్ ముందర దిగి సరిగ్గా ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఇరానీ కేఫ్‌లో కూర్చున్నాడు టీకి ఆర్డరిచ్చి.

యింతకుముందు స్వర్ణ ఎక్కిన బస్ ఎందుకో లేటై అప్పుడే వచ్చింది స్టాప్‌లోకి. స్వర్ణ హంసలా దిగి—

అదిగో ఆమె వెంటనే ఎవడో

కుర్రాడు...ఎర్రనివాడు ... ఉంగరాల జుత్తువాడు, అందమైనవాడు కూడా దిగి... వాడు నడుమ ఎక్కాడా ఎక్కడైనా?...అసలెవడు వాడు?

"గుడ్‌మార్నింగ్" అన్నాడు వాడు–

"..." స్వర్ణ ఏదో అంది నవ్వుతూ. పువ్వులా నవ్వుతూ... నవ్వుతూ ఎందుకనాలి.

అతనూ, ఆమే నవ్వుతూ, ప్రక్క ప్రక్కనే నడుస్తూ వెళ్ళిపోతున్నారు లోపలికి గేట్‌లోనుండి.

ఎందుకలా ప్రక్క ప్రక్కనే నడవాలి. యీామె అతని వెనకాలో, కాకుంటే కాస్త ముందో ఎందుకు నడువ కూడదు?

రోగ్ రోగ్–

యిద్దరూ కలిసి మెట్లెక్కి వరండాలో పెట్టి ఉంచిన రిజిష్టర్‌లో సంతకాలు పెట్టి సీట్లలోకి వెళ్ళిపోయారు.

బేరర్ తెచ్చిన టీని గబగబా తాగి పైస లిచ్చేసి చరచరా స్వర్ణ పని చేస్తున్న ఆఫీసు లోకి నడిచి ఫస్ట్‌ఫ్లోర్ పైకెల్లి వరండాలో నిలబడితే – క్రింద స్వర్ణ పనిచేస్తున్న సీటూ, ఆమె చుట్టు ప్రక్కలున్న సెక్షన్ కనబడుతోంది దొంగచాటుగా ఆమె కదలికలను గమనిస్తూ ఉండిపోయాడు

స్వర్ణ లేచి తన కెదురుగా ఉన్న ఎర్రయువకుని దగ్గరకు వెళ్ళింది చేతిలో ఏదో ఫైలుతో. ఏదో అడిగి ఓ చిరునవ్వు నవ్వి మళ్ళీ వచ్చి కూర్చుంది. యింకాస్సేపటికి వాడు ఏదో కాగితాన్ని పట్టుకుని ఆమె దగ్గరికొచ్చి ఏదో మాట్లాడి – యింతలో ప్యూన్ టీ పట్టుకొచ్చినట్టున్నాడు. అందరికీ కప్పు లందిస్తున్నాడు. యింతలో స్వర్ణకు అటు ప్రక్కసీట్లో కూర్చున్న ఎవడో కొలీగ్ ఏదో జోక్ వేసినట్టున్నాడు. అందరూ ఊకుమ్మడిగా నవ్వి – స్వర్ణ కూడా నవ్వుతోంది ఎగిరెగిరిపడి.

యీామె ఎందుకంత విచ్చలవిడిగా నవ్వుతోంది ... నవ్వకుంటే పని నడవదా.

ఆ శ్రేయోభిలాషిగాడు రాసిన ఎదుటి సీట్‌వాడు ఆ ఎర్రయువకుడేనా. స్వర్ణ వానితోనే–

ఇక ఆలోచించలేకపోయాడు. ఇంకో సిగరెట్టును నోట్లోపెట్టుకుని కసిగా అగ్గిపుల్ల గీశాడు.

అలాగే మధ్యాహ్నందాకా ఆమె సెక్షన్‌లో ఆమె ప్రతి కదలికనూ భూతద్దం పెట్టి గమనించినట్టు గమనించి – విసిగి ఎటో కాస్సేపు వెళ్ళిపోయి...మనసును యింకా కెలికిన పుండులా చేసుకుని మళ్ళీ సాయంత్రం ఆమె ఆఫీసుకు వచ్చి యింకాస్సేపు మళ్ళీ కదలికలను పరిశీలించి–

ఆఫీసుఅయిపోయిఆమె బస్టాండ్‌లో నిలబడ్డప్పుడు ఆమె ప్రక్కనే ఆ ఎర్రవాడూ, యింకో యు. డి. సీ. ఎవడో

కూడా నిలబడి—ఏదో మాట్లాడుతున్నారు నవ్వుతూ, ఎంతో ఫ్రీగా. యింతలో బస్ వచ్చేసింది. గబగబా ఎక్కేసారు అందరూ.

బరువుగా నిట్టూర్చి బయటపడ్డాడు రామారావు అక్కడినుండి.

యింటికి రాగానే - స్వర్ణ కమలంలా నిర్మలంగా తయారై కాఫీ కప్పుతో ఎదురై "ఎక్కడి కెళ్ళారండీ ఒంట్లో బాగులేదని" అంది నొచ్చుకుంటూ.

నం ...గ ...నా ...చి — అను కున్నాడు మళ్ళీ కసిగా.

ఆమెను ఎన్నో తిట్లు తిట్టాలనీ, ఏవేవో మాటలనాలనీ, తన కోపాన్ని, కసినీ తీర్చుకోవాలనీ- యింకా యింకా మాటల కందని ఏవేవో పనులు చేయా లనీ అనిపించిం దతనికి. కాని ఎలా అంటాడు. ఏ ఆధారం తన దగ్గరుందని అంటాడు. ఏ సాకును చూపించి అంటాడు.

విసుక్కుంటున్నాడు లోలోపల.

కాఫీ త్రాగాక కప్పును పట్టుకెళ్లింది. వంటచేసింది. యింటిని సర్దింది. పడక గదిలో అన్నీ సవరించింది—చీకటి పడ్డాక కాస్సేపు మామూలుగా ఏవేవో కబుర్లు చెప్పి ... యిద్దరికీ భోజనం వడ్డించి తినడం ముగించిన తర్వాత-

రాత్రి పడకల పైకి చేరుకున్నాక — స్వర్ణను ముట్టుకోవాలంటే ఏదో మచ్చల పాము ను ముట్టుకోబోతున్నట్టుగా అనిపించసాగిం దతనికి. పైకి కప్పువంక చూస్తూ ఉండిపోయాడు అచేతనంగా.

"మనసు బాగోలేదా" అంది స్వర్ణ అనునయంగా.

"........."

"ఎందుకు - ఆ ఉత్తరం వచ్చి నందుకేనా?"

ఉలిక్కిపడి ఆమెవైపు తిరిగా డతను.

"ఓ ఆడది ఉద్యోగం చేస్తూంటే ఆమెపై ఎవరైనా ఎన్నో పుకార్లను పుట్టించవచ్చు. ఎన్నో అపవాదులను సృష్టించవచ్చు. అలాంటప్పుడు మనం పుకార్లకు లొంగని స్థిమితతను అల వరచుకోవాలి. మన వ్యక్తిత్వాల సంగతి మనకు తెలియాలిగాని ఎవరో ఏదో అంటే మన సంగతి మనకు తెలియ కుండా పోతుందా చెప్పండి. యీ విష యమే మీకు తెలియాలని ఆ ఉత్తరాన్ని నేనే మీకు రాశాను. క్రింద పూవు గుర్తుంది కదూ. యివ్వాళ దొంగ కారణంతో ఆఫీసుకు లీవ్ పెట్టి నన్ను ప్రొద్దంతా ఫాలో అయి ఎందు కనవ సరంగా మనసును పాడుచేసు కున్నారు?" స్వర్ణ తొణకకుండా చెబుతోంది.

ఆమెవంక పసివానిలా చూస్తూ ఉండిపోయాడు రామారావు.